క్లుప్తంగా


భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులో కుందూనది ఒడ్డున వెలసిన శ్రీజంబులాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి బోనాల పండుగను పురస్కరించుకొని శుక్రవారం చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు శ్రీసూక్త విధాన క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్లు, ఫలాలు, వేప రసంతో అభిషేకించిన అనతరం ప్రత్యేకంగా అలకరించారు. వేదపండితులు మాడుగుల నాగఫణిశర్మ అమ్మవారికి శాస్త్రోక్తంగా చండీ హోమం చేపట్టి పూర్ణాహుతి గావించారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



టెంకాయల అలంకారంలో కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం మాఘ మాసాన్ని పురస్కరించుకొని శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూలు, 108 టెంకాయలతో ప్రత్యేకంగా అలకంరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి పుష్పాభిషేకాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఉరుసు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

శిరివెళ్ల: మండల కేంద్రంలోని శ్రీ హజరత్ సయ్యద్ షానేషావలి ఉరుసు శుక్రవారం ఘనంగా జరిగింది. కుల మతాల కతీతంగా ప్రజలు తరలి వచ్చి స్వామి వారికి పూజలు చేశారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్ పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం, రాత్రి బెంగళూరు, ముంబయి కళాకారుల ఆధ్వర్యంలో ఖవ్వాలీ పోటీలు జరిగాయి.

నీటి సమస్యకు పరిష్కారం



హరినగరంలో కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

రుద్రవరం: మండలంలోని హరినగరంలో గ్రామ సర్పంచు సవరం కమలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగముని.. దాత సహకారంతో స్థానికులకు మంచినీటి సౌకర్యం కల్పించి సమస్యకు పరిష్కారం చూపారు. గిరిజన తండా అయిన హరినగరం ప్రస్తుతం పంచాయతీగా మారింది. దీంతో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. గ్రామంలో మంచినీటి బోరు ఉన్నప్పటికీ వర్షాభావ పరిస్థితులతో నీటి దార తగ్గింది. వేసవిలో నీటి సమస్య తలెత్తే అవకాశముందని భావించి ముందస్తుగా గ్రామానికి చెందిన ఓ దాత సహకారంతో బోరు వేయించి మోటారు అమర్చి, ట్యాంక్ ఏర్పాటు చేసి కుళాయిలు అమర్చారు. నీటి సమస్య తీరిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మోటార్లకు నీరు అందేలా జేసీబీతో కాలువ చేయిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సమీపంలోనున్న కుందూనదిలో నీరు పూర్తిగా అడుగంటింది. దీంతో గ్రామంలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యగా గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి శుక్రవారం చర్యలు చేపట్టారు. కుందూనదిపై ఉన్న బ్రిడ్జి వద్ద గుంతలో నీటి నిల్వలు ఉండటంతో అక్కడి నుంచి గ్రామానికి సరఫరా చేసే మోటార్లకు నీరు అందేలా జేసీబీతో కాలువ తీయించారు.

నాడు అధ్వానం..

నేడు అద్భుతం

నాడు..సర్కారు బడి అంటే చిన్నచూపు, నేడు..కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా సౌకర్యాలు, ల్యాబ్‌లు, ట్యాబ్‌లు, ఆధునిక బోధన. ఇంత మార్పు కేవలం నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసి చూపించారు. ప్రస్తుతం మన బడులు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా మారాయి. తాము చదువుకున్న విద్యాలయాలను చూసి పూర్వ విద్యార్థులు సైతం ఆశ్చర్యచకితులవుతున్నారు. ఇంతలా మార్చారా.. అంటూ కళ్లార్పకుండా చూస్తూ.. తరగతి గదిలో కూర్చొని ఆధునిక విధానంలో పాఠాలు చెప్పడం చూసి నివ్వెరపోతున్నారు.

- నాడు–నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలలు
- రూ.10.93 కోట్లతో పూర్తిస్థాయిలో వసతుల కల్పన
- మొదటి విడతలో 14 స్కూళ్లకు రూ.4.10కోట్లు
- రెండో విడతలో 16 బడులకు రూ.6.83 కోట్లు కేటాయింపు



దీబగుంట్ల హైస్కూల్‌లో గోడలపై రంగు రంగుల చిత్రాలు



యాళ్లూరు హైస్కూల్‌లో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయిలు



గోస్పాడు మోడల్ స్కూల్

గోస్పాడు: విద్యావ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా ప్రక్షాళన చేసింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి పాఠశాలలను తలపిస్తూ సర్వాంగ సుందరంగా రూపురేఖలు మార్చేశారు. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో వసతులు కల్పించడంతోపాటు వాటిని అభివృద్ధి చేసేలా ఇప్పటికే రెండు విడతల కింద నిధులు మంజూరు చేశారు. ఎంతోకాలంగా పాఠశాలలు అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరడంతో పాటు విద్యార్థులకు సరైన వసతి సౌకర్యాలు లేక ఎంతో ఇబ్బందులకు గురవుతుండేవారు. వీటిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు.

ఇది కదా.. అభివృద్ధి

రెండు విడతల్లో వసతుల కల్పన..
మండలంలో 32 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 3,810 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. నాడు–నేడు కింద అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటి విడత కింద 14 పాఠశాలలకు రూ.4.10కోట్లు, రెండో విడత కింద 16 పాఠశాలలు ఎంపిక కాగా రూ.6.83 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టారు. వీటితో పాఠశాలల్లో తొమ్మిది రకాల వసతులు సమకూర్చి తీర్చిదిద్దారు.

పూర్తిస్థాయిలో మౌలిక వసతుల ఏర్పాటు....
శిథిలావస్థలో ఉన్న తరగతి గదులకు మరమ్మతులు, విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, తాగునీటి వసతి, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, ల్యాబ్‌ల ఏర్పాటు, గ్రీన్ బోర్డులు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్, అదనపు తరగతుల గదులు, ప్రహరీ, బాత్‌రూంలు నిర్మించారు.



మోడల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు

పాఠశాలను పూర్తిగా మార్చేశారు



వసతులు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. మా పిల్లలను గతంలో బడులకు పంపాలన్న ఆసక్తి ఉండేది కాదు. ప్రస్తుత ప్రభుత్వం బడులను అద్భుతంగా తీర్చి దిద్దింది. సెలవులకు ముందు పనులు చేపట్టారు. ఏదో చేస్తున్నారని మేం పట్టించుకోలేదు. బడి తిరిగి తెరిచిన తరువాత చూస్తే.. ఇది మా స్కూలేనా అని ఆశ్చర్యపోయాం. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఇన్ని వసతులుండవు. ప్రస్తుతం చాలా బాగుంది. ఇలా చేస్తే వ్యవస్థలు బాగుపడతాయి కదా. ఇంగ్లిష్ మీడియంలో బోధనను మేం ఊహించలేదు.

–చాంద్‌బాషా, విద్యార్థిత,ండ్రి, జూలేపల్లె

మా బడి చాలా బాగుంది



పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు ఉన్నాయి. ఎంతో బాగా మార్చారు. ఇంతలా మారుస్తారని మేం అనుకోలేదు. మాకు యూనిఫాంతో పాటు బ్యాగులు, పుస్తకాలు, బెల్టు, బూట్లు అన్నీ ఉచితంగా అందాయి. బడిలో మాకు ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు.

– కీర్తన, విద్యార్థిని, పదో తరగతి, యాళ్లూరు

విద్యాభివృద్ధికి దోహదపడతాయి



ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో చేపట్టారు. బడులు ఎంతగానో అభివృద్ధి చెందాయి. పాఠశాలల గోడలపై వేసిన పెయింటింగ్ పాఠ్యాంశాలకు సంబంధించినవి కావడంతో విద్యార్థులకు సులభంగా అర్థమవుతున్నాయి. ట్యాబ్‌లు అందజేశాం, స్మార్ట్ టీవీల ద్వారా బోధన సాగుతోంది.

– అబ్దుల్‌కరీం,ఎంఈఓ, గోస్పాడు

పేదలకు ఆరోగ్య భరోసా



హరివరంలో వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలందరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని ఎంపీడీఓ రఘురాం, సర్పంచ్ నడిపెన్న, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హరివరం గ్రామంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చంద్రశేఖర్, కిశోర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, అపర్ణ, రమేష్ ప్రజలకు వైద్య సేవలు అందించారు. మొత్తం 506 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 34 మందికి కంటి పరీక్షలు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌బాబు ఉన్నారు.

466 మందికి వైద్య పరీక్షలు
రుద్రవరం: స్థానిక సచివాలయం–2 పరిధిలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు ప్రశాంత్,శివాణి 466 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోలని వైద్యులు ప్రజలకు సూచించారు.



దొర్నిపాడులో గ్రామస్తుడికి మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

దొర్నిపాడు: స్థానిక సచివాలయం–2లో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరంలో 471మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. వైద్యులు రుహుల్లాఖాన్, సుధాకర్‌రెడ్డి, యునాని డాక్టర్ షకీరాబేగం వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, మాలతి, సచివాలయ కన్వీనర్ లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పశుబీమా చేయించుకోవాలి

నంద్యాల (సెంట్రల్): పాడి, పశుపోషణ, జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు, పెంపకందారులు వైఎస్సార్ పశుబీమా చేయించుకోవాలని నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ 2 – 10 సంవత్సరాల వయస్సున్న నాటు ఆవులు, 3–12 సంవత్సరాల వయస్సున్న మేలు జాతి, సంకరజాతి పాడి పశువులు, పాడి గేదెలకు బీమా వర్తిస్తుందన్నారు. ఒకటిన్నర సంవత్సరం పైబడిన మేలుజాతి ఎద్దులు, దున్నలు, రెండేళ్ల పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు బీమా ఉందన్నారు. 6 నెలలు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు కూడా బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. పాడి పశువు, గేదె విలువను బట్టి లబ్ధిదారులు తమ వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లిస్తే.. మిగిలిన 80 శాతం ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని నంద్యాల పరిధిలో 108 పశువుల లక్ష్యానికి గాను 122 పశువులకు బీమా, మహానంది పరిధిలో 60కి గాను 56 బీమా చేశామని స్పష్టం చేశారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ

నంద్యాల: జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, ఆర్‌టీఓ జి.వి. శివారెడ్డి, డీఎస్పీలు,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలోని శాంతిరాం మెడికల్ కళాశాల, చాబోలు క్రాస్, అయ్యలూరు మెట్ట, ఆళ్లగడ్డలోని అహోబిలం క్రాస్, ఏపీ గోడౌన్స్, బలపనూరు క్రాస్ తదితర జాతీయ రహదారుల్లో ప్రమాదాల నియంత్రణకు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారని, వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని వై జంక్షన్ నుంచి ఐటీసీ వరకు లైటింగ్ లేని కారణంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజుల్లో లైటింగ్ ఏర్పాటు చేసి సంబంధిత ఫొటోలను తనకు పంపాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిని ఆదేశించారు. అలాగే కుందూ నది, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ రద్దీ ప్రాంతాల్లో మూడు రోజుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డికి సూచించారు. ద్విచక్ర వాహనదారులు బీఐఎస్ హెల్మెట్‌లనే వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కుబడిగా పనులు చేయకుండా పోలీస్, రవాణా, మున్సిపల్ అధికారులు సూచించిన పనులను ఖచ్చితంగా పూర్తి చేయాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఎంట్రీ, ఎగ్జిట్ గుర్తింపు సూచికలు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల్లో ప్రమాదాల నియంత్రణకు సూచించిన భద్రతా చర్యలు చేపట్టలేదని జాతీయ రహదారుల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇలాగే వ్యవహరిస్తే టోల్‌గేట్ మూసివేతకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణంలో ఫుట్ పాత్‌లను దుకాణదారులు ఆక్రమించకుండా పాదాచారులు నడిస్తే రోడ్లపై ప్రమాదాలు నివారించవచ్చని ఇందుకు సంబంధించి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ రహదారుల్లో 8 హైవే పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో గత రెండు సంవత్సరాలతో పోలిస్తే భద్రతా చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదాల బారిన పడిన మరణాల సంఖ్యను తగ్గించగలిగామని వివరించారు.

రైల్వే స్టేషన్‌కు కొత్త హంగులు

- మోడరన్‌గా మారనున్న నంద్యాల రైల్వే స్టేషన్
- రూ.21.80 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్
- ప్రయాణికులకు మౌలిక నదుపాయాల కల్పనకు పెద్దపీట
- అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌కు ఎంపిక
- ఈనెల 26న అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



రైల్వే స్టేషన్ నమూనా చిత్రం

నంద్యాల(సిటీ): నంద్యాల రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. గుంటూరు డివిజన్ పరిధిలోని 13 రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ స్టేషన్ స్కీంకు ఎంపిక కాగా నంద్యాల జిల్లాలో జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎంపికై ంది. దీన్ని మరో మోడల్ స్టేషన్‌గా తీర్చి దిద్దేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తుంది. స్టేషన్ అభివృద్ధికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి చేసిన కృషి ఫలించింది. రూ.21.80 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఈ నెల 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని రైల్వే శాఖ అధికారులు తెలిపారు. కేంద్రం ప్రతిపాదించిన 53 సదుపాయాలను ప్రయాణికులకు కల్పించేందుకు పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్లను రూపొందించి వాటికి సంబంధించిన పనుల పర్యవేక్షణకు 'గతి శక్తి' పేరుతో టాస్క్‌ఫోర్స్ నిపుణల కమిటీలను ఏర్పాటు చేసింది రైల్వే శాఖ. పనుల పర్యవేక్షణ కోసం నంద్యాల నోడల్ అధికారిగా ఆర్.డీ శ్రీహర్షను నియమిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన విధంగా రాష్ట్రంలో అమృత్ భారత్ స్టేషన్లను పూర్తి స్థాయిలో ఆధునీకరించనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలియజేస్తున్నాయి. కాగా ఇప్పటికే నంద్యాల రైల్వే స్టేషన్‌ను పలువురు ఉన్నతాధికారులు పర్యవేక్షించి ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలను గుర్తించి నివేదించారు. స్టేషన్ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా మార్పులు చేయడానికి పచ్చ జెండా ఊపారు. దీంతో నంద్యాల రైల్వే స్టేషన్ నూతన హంగులు సమకూర్చుకోనుంది.

రైల్వే స్టేషన్‌లో కల్పించే ప్రధాన సౌకర్యాలు..
- స్టేషన్‌లో ఫ్లోరింగ్, భవనాలు ఆధునికతను చాటేలా నిర్మించనున్నారు.
- ఇప్పుడు ఉన్న ప్లాట్‌ఫామ్‌లకు అదనంగా మరో రెండు ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తారు.
- ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫాం పొడవును మరింతగా పొడిగించనున్నారు.
- ప్లాట్ ఫాం వెంట ప్రత్యేక రూఫ్ షెడ్లు ఏర్పాటు చేస్తారు.
- వెయిటింగ్ హాల్స్, కెఫెటీరియాలు నాణ్యమైన సేవలను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు.
- వాహనాల్లో స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికుల వాహనాలు సులభంగా వెళ్లడానికి, రావడానికి ద్వారాలను సిద్ధం చేస్తున్నారు.
- దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రవేశ మార్గాలు, వీల్ చైర్స్, గ్రౌండ్ వాటర్ ట్యాప్ తదితర సదుపాయాలు కల్పించనున్నారు.
- మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం కొత్తగా రెండు లిఫ్టులు, ఒక ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. కాగా ఇప్పటికే ఒక లిఫ్టు పనులు పూర్తయ్యాయి.

వేగంగా ఆధునీకరణ పనులు



నంద్యాల రైల్వే స్టేషన్‌ను అత్యంత సుందరంగా అధునాతన హంగులతో రైల్వే శాఖ తీర్చి దిద్దుతుంది. అమృత్ భారత్‌స్టేషన్ స్కీం కు నంద్యాల స్టేషన్ ఎంపికవ్వడం హర్షణీయం. రైల్వే శాఖ కేటాయించిన రూ.21.80 కోట్లతో పలు ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నంద్యాల ప్రయాణికులకు మరింత సులభతరమైన, సౌకర్యవంతమైన సదుపాయాలను కల్పించేలా పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఫ్లోరింగ్, పార్కింగ్, సెకండ్ ఎంట్రెన్స్, లిఫ్టు, ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, రూఫ్ తదితర సదుపాయాలు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

– దొరస్వామి, స్టేషన్ మాస్టర్, నంద్యాల

- రెండవ ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లడానికి సులభంగా మరో 12అడుగుల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ను నిర్మించారు.
- వేగవంతమైన వైఫై సేవలకు 5జీ టవర్లు ఏర్పాటు చేస్తారు
- ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్
- వన్ స్టేషన్ వన్ ప్రాడక్ట్ అనే నినాదాన్ని సఫలీకృతం చేస్తూ స్థానిక ఉత్పత్తుల విక్రయానికి పెద్దపీట వేస్తూ స్టేషన్‌లో కనీసం రెండు స్టాళ్లను ఏర్పాటు చేశారు.



స్టేషన్‌లో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులు,



నంద్యాల జంక్షన్ బోర్డు



ప్రయాణికులకు ఏర్పాటు చేసిన లిఫ్టు

బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



సాయిబాబానగర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): రైతాంగాన్ని విస్మరించి, నల్లచట్టాలను అమలు చేస్తున్న, మద్దతు ధర కల్పించాలని నిరసన వ్యక్తం చేస్తున్న దమనకాండ సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారని సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై కాల్పులు జరిపిన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరుతూ శుక్రవారం సాయిబాబానగర్ సెంటర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు బాబాఫకృద్దీన్, ప్రసాద్, రైతు సంఘం నాయకులు సుబ్బరాయుడు, సోమన్న, ధనుంజయుడు మాట్లాడారు. హుసేన్‌సా, నారాయణమ్మ, ఎర్రిస్వామి, మాబు, మురళీ, శీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో ధర్నా నిర్వహించారు. తోటమద్దులు, మహమ్మద్‌గౌస్ మాట్లాడుత శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై దాడి చేయడం మోదీ ప్రభుత్వానికి తగదన్నారు.

పౌష్టికాహారం పంపిణీ
నంద్యాల(న్యూటౌన్): స్థానిక వివేకానంద ఆడిటోరియంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు రెడ్‌క్రాస్ సొసైటీ, వైఆర్‌జీకేర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు దస్తగిరి, ప్రసాద్, సుధారాణిల ఆధ్వర్యంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, మహానంది ఈఓ చంద్రశేఖర్ రెడ్డి పౌష్టికాహారం, మందులు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న ప్రజాపోరు యాత్ర
నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర శుక్రవారం కొనసాగింది. బైర్మల్‌వీధి, చైనాబజార్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, రమేష్, శివ సాయి, స్వాతి పాల్గొన్నారు.